క్లుప్తంగా

లో ఓల్టేజీ సమస్య పరిష్కరిస్తాం



తేనబండలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

చిత్తూరు కార్పొరేషన్‌: నగరంలోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్‌ తెలిపారు. గురువారం సంతపేట సెక్షన్‌ పరిధిలోని తేనబండ దళితవాడలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో అధికలోడ్‌ను గుర్తించామన్నారు. అక్కడ దశలవారీగా ట్రాన్స్‌ఫార్మర్లు పెడతామన్నారు. వేసవిలో విద్యుత్‌ అంతరాయం లేకుండా దృష్టి సారించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి భాగ పరిష్కారం చేయాలి

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): తమ కుటుంబానికి చెందిన ఉమ్మడి ఆస్తిని భాగ పరిష్కారం చేయకుండా తన సోదరుడు వెంకటేష్‌ కుట్రకు పాల్పడ్డారని యాదమరి మండలానికి చెందిన లోకనాథ గౌండర్‌ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరులోని లాడ్జి స్థలాన్ని సైతం విక్రయించేందుకు సోదరుడు కుట్ర చేశారని, ప్రశ్నించిన తమపై అకారణంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విలువైన తమ ఉమ్మడి ఆస్తులను కుటుంబ సభ్యుల మధ్య భాగ పరిష్కారం చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



కరిడివారిపల్లెలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బంగారుపాళెం: గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ నాగేశ్వర్‌రావు ఆదేశించారు. గురువారం మండలంలోని కరిడివారిపల్లెలోని ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు సమ్మర్‌ లెర్నింగ్‌ యాక్టివిటీ నిర్వహించాలని, గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులను కలసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు సంఖ్య పెంచాలని హెచ్‌ఎం శేఖర్‌కు సూచించారు.

పంటల సాగుకు 'ఉపాధి'తో ప్రోత్సాహం



బాల

తవణంపల్లె: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద రైతులు తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయం వచ్చే పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు తవణంపల్లె ఈజీఎస్‌ ఏపీఓ బాల గురువారం తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూతనంగా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వివిధ వ్యవసాయ ప్రయోగాలకు పూనుకుంటున్నట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద మునగ, పశుగ్రాసం పెంచడం, డ్రాగన్‌ ఫ్రూట్‌ తోట పెంపకం, మల్లెపూలు, రోజా పూల సాగును ప్రోత్సహిస్తామన్నారు. వీటితో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఉపాధి పథకం పరంగా రైతుల జీవన ప్రమాణాలు, ఆర్థిక సౌలభ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా పంటల సాగును ప్రోత్సహిస్తామన్నారు. ఈ దిశగా తక్కువ భూమి(అర్ధ ఎకరా) ఉన్నా.. ఎక్కువ భూమి ఉన్న రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగ నిర్ధారణ చేస్తే నేరం

యాదమరి: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ చెప్పారు. దీనిపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను గురువారం ఆయన సంతగేటులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు అందజేసి మాట్లాడారు. కొందరు గర్భిణులు తమ గర్భస్థ శిశువు ఆడా, మగా? అని తెలుసుకునేందుకు ప్రైవేటు స్కానింగ్‌ సెంటర్లను ఆశ్రయిస్తున్నారని, శిశువు ఎదుగుదల ఎలా ఉందో తెలుసుకోవాలేగానీ లింగ నిర్ధారణ కాదని హితవు పలికారు. స్కానింగ్‌ సెంటర్లు దీనిని అవకాశంగా తీసుకుని లింగ నిర్ధారణ గురించి చెబితే చట్టపరంగా కేసులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కూడా పాల్గొన్నారు.

నేడు గుడ్‌ ఫ్రైడే ప్రార్థనలు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): చిత్తూరులోని చర్చిలు గుడ్‌ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. శుక్రవారం ఉదయం అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి ప్రత్యేక ప్రసంగాలు ఉంటాయి. ఆ తర్వాత ఉపవాస దీక్షలు విరమిస్తారు. ఈ నేపథ్యంలో పలమనేరు రోడ్డులోని జాన్‌ బాస్కో చర్చి, చర్చివీధిలోని టౌన్‌చర్చి, కొంగారెడ్డిపల్లెలోని బీటీ మెమోరియల్‌ చర్చిలతో పాటు పలు చర్చిలు విద్యుత్‌ దీపాలతో కాంతులీనుతున్నాయి.

ఫ్రిడ్జ్‌ నీళ్లొద్దు.. కుండ నీళ్లే ముద్దు..!

అసలే వేసవి..రోజు రోజుకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు ప్రజలకు ఉక్కపోత పరీక్ష పెడుతున్నాయి. అలాగే దాహం కూడా పెరిగిపోతూ ఉంటుంది. నీళ్లు తాగినా తీరని దప్పిక. రిఫ్రిజిరేటర్లు ఉన్నా అలంకారప్రాయమే. ఈ పరిస్థితుల్లో కుండనీరు తాగడం ఆరోగ్యపరంగా అన్ని విధాలా శ్రేయస్కరమని పెద్దలు చెప్పేమాట. శీతల పానీయాలు, ఫ్రిడ్జిలోని కూలింగ వాటర్‌కన్నా మట్టి కుంట నీళ్లు తాగడమే మంచిదని వైద్యులు సెలవిస్తున్నారు. ఇప్పుడు వేసవిలో అందరి చూపు మట్టి కుండలపై పడింది.

- వేసవిలో మట్టి కుండల వైపు మొగ్గుతున్న జనం
- పెరుగుతున్న అమ్మకాలు
- ఆరోగ్యానికి కుండ నీళ్లే శ్రేష్టమంటున్న వైద్యులు



మట్టికుండలను తయారుచేస్తున్న కుమ్మరులు







అమ్మకానికి సిద్ధంగా కుండలు, దేవుడు బొమ్మలకు రంగులు వేస్తున్న మహిళ

గుడిపాల: సామాన్యుడి ఫ్రిడ్జ్‌లా పేరొందిన మట్టికుండలకు డిమాండ్‌ పెరుగుతోంది. వేసవితాపం తీర్చేది చల్లటి నీరే. సామాన్యులకు చల్లటి నీటిని మట్టికుండలు తప్ప వేరేవి అందించలేని పరిస్థితి. ఆర్థికంగా బాగా ఉన్నవారు ఫ్రిడ్జిలు, ఇతరత్రా ఉపకరణాల చల్లటినీరు వినియోగించడం పరిపాటి. అయితే మట్టి కుండల శ్రేష్టత తెలిసిన పేదలు, గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాల వీటిపై కొనుగోలు చేస్తున్నారు. కొన్ని రోజులుగా భానుడు తన ప్రతాపం చూపుతుండడంతో మట్టికుండల కొనుగోళ్లు మండలంలో ఊపందుకున్నాయి.

గుడిపాలలో అన్నిరకాల కుండలు

మండలంలోని వసంతాపురంలో కుమ్మరి కులస్తులు అధికంగా ఉన్నారు. ఇక్కడ తయారు చేసిన కుండలను ఎక్కువగా వ్యాపారులు చిత్తూరుకు తీసుకువెళ్తుంటారు. ఇక్కడ వివిధ రకాల కుండలు లభిస్తున్నాయి.ముఖ్యంగా ఆకుకూరలు వండేందుకు రాళ్లసట్టులు, పుష్పతొట్టెలు, పశువులు నీరు తాగే తొట్టెలు, కుండలు, వంటచేసే పొయ్యిలు, దీపావళి పండుగ సమయంలో ఇంటి ముందు వెలిగించే దీపాలతో సహా అనేక రకాలను తయారు చేస్తుంటారు. ఇక్కడ కుండలకు మంచిగిరాకీ ఉంటోంది. ముందుగానే చిత్తూరు నుంచి వ్యాపారస్తులు వచ్చి ఈ కుండలను తీసుకువెళ్తుంటారు. గ్రామీణప్రాంతాల్లో వీటికి ఆదరణ ఇప్పటికీ లభిస్తోంది.

కుమ్మర్లకు తక్కువ.. వ్యాపారస్తులకు ఎక్కువ

కుండలు తయారుచేసే కుమ్మర్ల నుంచి ఒక్కో కుండను 100 రూపాయలకు కొనుగోలు చేసే వ్యాపారస్తులు మాత్రం వాటిని 170 రూపాయల పైచిలుకు విక్రయిస్తున్నారు. వివిధ కుండల అమ్మకాలను చిత్తూరులో జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వం తమకు సబ్సిడీపై అవసరమైన వాటిని ఇస్తే తమ జీవితాలకు మరింత చేయూతనిచ్చినట్లవుతుందని కుమ్మరి కులస్తులు చెప్పారు.

దేవుడు బొమ్మలకు భలే గిరాకీ

గ్రామీణ ప్రాంతాల్లో మట్టితో చేసే దేవుడు బొమ్మలకు మంచి గిరాకీ ఉంది. రెండు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు మునీశ్వరస్వామికి గుండు గీయించడం ఆనవాయితీ. ఆ సమయంలో మునీశ్వరస్వామి వద్ద మట్టితో చేసిన గుర్రపు బొమ్మలను ఉంచడం సంప్రదాయం. వీటిని వసంతాపురం, బండపల్లె గ్రామాల్లో అధికంగా చేసి విక్రయిస్తుంటారు. ఏది ఏమైనప్పటికీ ఆధునికతతో ఓ వైపు పరుగులు తీస్తున్నా, మట్టితో తయారు చేసిన కుండలు, ఇతరత్రా వాటికి ఆదరణ మాత్రం ఇప్పటికీ తగ్గలేదు.

వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ పూర్ణలత

ఐరాల: వేసవి కాలంలో రోజురోజూకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌ పూర్ణలత అన్నారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు.. 104 వాహనంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఇక, వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్‌ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రయాణాలను ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటలపైన ఉండేలా చూసుకోవాలన్నారు. బయటకు వచ్చేటపుడు గొడుగు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మంచి నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. హెల్త్‌ అసిస్టెంట్‌ సుధాకర్‌, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్‌

చిత్తూరు అర్బన్‌: చిత్తూరులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని వన్‌టౌన్‌ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరంలోని భరత్‌నగర్‌ కాలనీలో మహబూబ్‌ బాషా అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు చేశారు. నిందితుడి వద్ద అర్ధ కిలో గంజాయి లభించడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితుడిని చిత్తూరు జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి' నీటి కుంటలు లాభదాయకం

యాదమరి: వర్షపు నీటిని ఒడిసిపట్టి సాగునీటి ఎద్దడి నివారణ కోసం నిర్మించే నీటి కుంటలు రైతులకు ఎంతో లాభదాయకం అని ఏపీఓ సంధ్యారాణి అన్నారు. గురువారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. వేసవిలో మండలంలోని రైతులు సాగు నీటి ఎద్దడిని అధిగమించడానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటలు నిర్మించుకోవచ్చన్నారు. పంటల సాగుకే కాకుండా చేపల పెంపకానికి కూడా వీటిని ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఒక్కో పంచాయతీకి దాదాపు 20 నీటి కుంటలు మంజూరయ్యాయని, అలాగే మూగ జీవాల దాహార్తిని తీర్చడానికి పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి మండలానికి 33 వరకు మంజూరు అయ్యాయని, ఒక్కో నీటి తొట్టెకు రూ.33 వేల నిధులు కేటాయించారని చెప్పారు. వీటిని మూడు రోజుల్లో పూర్తిచేయాలని, క్షేత్ర సహాయకులు గ్రామస్థాయిలోని అర్హత గల రైతులను గుర్తించి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్‌, అధ్యాపకులు

ఐరాల: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌ రెడ్డిరామరాజు ఆకాంక్షించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్‌ ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులను ఆయన అధ్యాపకులతో కలిసి అభినందించి మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరం ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వంద శాతం, ప్రథమ, ద్వితీయ బైపీసీ గ్రూపులో వంద శాతం, ఆర్ట్స్‌ గ్రూపులో 90 శాతం, ఒకేషనల్‌ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో మురహరి 946 మార్కులు సాధించాడని, ప్రైవేటు కళాశాలలకు దీటుగా తమ కాలేజీ ఫలితాలు సాధించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఎంపీసీ విద్యార్థులకు ఐఐటీ మద్రాసు నిపుణులతో ఆన్‌లైన్‌ క్లాసులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమ కాలేజీలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మిందపాళ్యంలో 'ఫ్యామిలీ డాక్టర్‌'



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్‌ ప్రవీణ్‌



తవణంపల్లె: వృద్ధులకు పరీక్షిస్తున్న డాక్టర్‌ వినయ్‌కుమార్‌

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్‌ ప్రవీణ్‌ కోరారు. మండలంలోని తుమ్మిందపాళ్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాజేశ్వరి, చంద్రశేఖర్‌, నందిని, నిరోషా, గౌరమ్మ పాల్గొన్నారు.

ఏ.గొల్లపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని ఏ.గొల్లపల్లెలో గురువారం తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్‌ వినయ్‌కుమార్‌ ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌ సూపర్‌వైజర్‌ రాజశేఖర్‌, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు





ముంగరమడుగు ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు, కొదలమడుగు పాఠశాలలో..

బంగారుపాళెం: విద్యార్థులు చదువుతోనే ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు అవకాశం ఉందని సర్పంచ్‌ కుమారి అన్నారు. మండలంలో గురువారం ముంగరమడుగు ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం హెచ్‌ఎం అనితాదేవి ఆధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్‌ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చగలిదేది విద్యమాత్రమేన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహోపాధ్యాయుడు మునిరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో..

కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం రవీంద్ర ప్రసాద్‌ ఆధ్యక్షతన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఓంకారం ఏర్పాటుచేసి పూజలు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, చదువుకున్న వ్యక్తులే సమాజంలో గౌరవ మర్యాదలు పొందుతున్నారని గుర్తెరిగి ఒక లక్ష్యంగా ముందుకుపోవాలన్నారు. ముఖ్య అతిథిగా విశ్రాంత హెచ్‌ఎం సంజీవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతనం నవోదయ పాఠశాలకు ఎంపికైన నాగార్జునను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, అమీన్‌ హుస్సేన్‌, హేమలత, రమ, బాలాజీ, స్వరాజ్యకుమారి, లలిత, వెంకటయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్‌ రాజేష్‌, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తాం



మాట్లాడుతున్న ఆశ్రమ నిర్వాహకులు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): ఏ ఆదరణా లేని వృద్ధులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పిస్తామని రాష్ట్ర కవుల కళాకారుల వృద్ధాశ్రమ సంఘం అధ్యక్షురాలు గాజుల రేవతి, కార్యదర్శి నటరాజ్‌ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌ క్లబ్‌ లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. అనాథలుగా ఉన్నా, ఎవరి ఆదరణకూ నోచుకోని వృద్ధులకు తాము నిలువనీడ కల్పిస్తామన్నారు. పుంగనూరు, తిరుపతి, పాకాల ప్రాంతాల్లో తమ ఆశ్రమాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో ఇప్పటి వరకు 150 మంది దాకా ఉన్నట్లు చెప్పారు. నిరాశ్రయులకు సంబంధించిన సమాచారాన్ని తమ ఆశ్రమాలు వారికి సమాచారం ఇస్తే ఆశ్రయం కల్పిస్తామన్నారు. వివరాలకు 8297816846, 8374044604 ఫోన్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్‌ తులశ్రీధర్‌ పాల్గొన్నారు.

21న విజయవాడలో ధర్నా జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్‌: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యూనియన్‌ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ సెంటర్లను మెయిన్‌ సెంటర్లుగా మారుస్తామని టీడీపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్‌ చేశారు. జిల్లా అధ్యక్షురాలు లలిత, ప్రధాన కార్యదర్శి షకీల మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, పలు యాప్స్‌ను రద్దు చేసి ఒకే యాప్‌ పెట్టాలని డిమాండ్‌ చేశారు. పనిభారం తగ్గించి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. హామీలు ఇచ్చిన వాటికి జీవోలు విడుదల చేయాలన్నారు. అలాగే జిల్లాలో 12 ప్రాజెక్టులలో స్థానికంగా వివిధ రకాల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొన్నిచోట్ల రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, వాటికి స్వస్తి పలకాలన్నారు. స్థానిక సమస్యలను జిల్లా ప్రాజెక్టు అధికారి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రమీల, మమత, విజయ, శోభ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టానికి హాజరైన జనం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో మహాభారతయజ్ఞంలో భాగంగా గురువారం జరిగిన దుర్యోధన వధ అలరించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అక్కడ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలతోపాటు రూరల్‌ మండల నేతలు స్వాగతం తెలిపారు. మండల కన్వీనర్‌బాలాజీ నాయుడు, సర్పంచ్‌ మునస్వామి, పాల్గొన్నారు.

చక్రస్నానంతో నవమి ఉత్సవాలు పరిసమాప్తం



కోదండరామాలయంలో కలశారాధన చేస్తున్న వేదపండితులు



చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

- వైభవంగా శ్రీరాముని వసంతోత్సవం, పట్టాభిషేకం

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలు గురువారం చక్రస్నానంతో పరిసమాప్తమయ్యాయి. తొలుత ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులతో వేదపండితులు కలశపూజ, ఆరాధన, దీపాపాధన చేయించారు.

భక్తిశ్రద్ధలతో మహా సుదర్శన హోమం

ఆలయం ఆవరణలో మధ్యాహ్నం వేదపండితులు మహా సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం కలశాలతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కలశాల్లోని తీర్థంతో సీతారామలక్ష్మణులకు అభిషేకం చేసి మొక్కుల చెల్లించారు.

సీతారామలక్ష్మణులకు చక్రస్నానం

సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులు, సుదర్శన చక్రంకు స్నానం శాస్త్రోక్తంగా చేయించారు. అనంతరం సీతారామలక్ష్మణులకు వసంతోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగిన స్వామికి రంగు నీళ్లు పోసి వేడుకగా వసంతోత్సవం..ఆ తర్వాత సాయంత్రం శ్రీరాముడికి పట్టాభిషేకం చేయించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.